
## మలక్‌పేట బీఆర్‌ఎస్‌దే..

మలక్‌పేట నియోజకవర్గంలో గతంలో రెండు డివిజన్ లలో కార్పొరేటర్లు విజయం సాధించారని, అదే పట్టుదలతో పిడికిలి బిగించి కారు గుర్తుకు ఓటు వేస్తే తప్పకుండా మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి విజయం సాధించడం ఖాయమని మంత్రి కేటీఆర్ అన్నారు. మలక్‌పేట అభివృద్ధి చేశామని, ఐటీ టవర్ లాంటి ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు ఏడాదిన్నర లోపే ఇక్కడికి వచ్చి ఈ ప్రాంత యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడుతాయన్నారు.



### సింహం లాంటి కేసీఆర్ కావాలా .. సీల్డ్ కవర్ సీఎంలు కావాలా?

సింహం ఎప్పుడైన సింగిల్ గానే వస్తుంది. కేసీఆర్ సింహం లాంటి నాయకుడని.. మళ్లీ విజయం సాధించి సింహంలా వస్తాడని కేటీఆర్ అన్నారు. ప్రతిపక్ష పార్టీలు ప్రధాన మంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిద్ధి రామయ్య, డీకే వస్తున్నారన్నారు.' అయినా సింహం కేసీఆర్ సింగిల్ గానే వెళ్తున్నారన్నారు. సింహం లాంటి కేసీఆర్ కావాలా... లేక సీల్డ్ కవర్ సీఎం లు కావాలా'? అని ప్రశ్నించారు. ఇందుకు సీఎం కేసీఆర్ కావాలంటూ ప్రజలు విక్టరీ గుర్తును చూపించారు.

# నాడు టీవీ టవర్.. నేడు ఐటీ టవర్

సైదాబాద్ / చాదర్‌ఘాట్, నవంబర్ 25: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మలక్‌పేట లో బీఆర్ఎ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డికి మద్దతుగా ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్ షోకు విశేష స్పందన లభించింది. మూసారాం బాగ్ డివిజన్‌లో శనివారం రాత్రి జరిగిన కేటీఆర్ రోడ్ షోతో గులాబీమయంగా మారింది. రోడ్ షో తిలకించడానికి అన్ని డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, సానుభూతిపరులు, అభిమానులు తరలివచ్చారు. గంటసేపు సాగిన రోడ్ షో ఉత్సాహకర వాతావరణంలో కొనసాగింది. కేటీఆర్ ఎన్నికల ప్రచార రథం పై మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి ఆజం అలీ, దాసోజు శ్రవణ్ కుమార్, మాజీ కార్పొరేటర్లు తీగల సునరితారెడ్డి, సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు. రోడ్డు షోకు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూమేశ్, డివిజన్ల అధ్యక్షులు రఘునందన్‌రెడ్డి, పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, కామేశ్, కారింగల మారుతి, జగన్, హయత్ హుస్సేన్ హబీబ్, నాయకులు ఫైబర్‌టెల్ రాజు, కావేటి ధర్మరాజు, తేల్ల మహేశ్ కుమార్, లక్ష్మణ్‌ఠాకూర్ పాల్గొన్నారు.

### ఏడాదిన్నరలో పనులు పూర్తి..

'మలక్‌పేట లో ఏర్పాటు చేస్తున్న ఐటీ టవర్ ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకరానున్నది. గతంలో మలక్‌పేట అంటే టీవీ టవర్ గుర్తుకొచ్చేది... కానీ, ప్రస్తుతం ఏడాదిన్నరలో పూర్తికానున్న ఐటీ టవర్ పేరుగాంచనున్నది. దీన్ని ఏడాదిన్నర కాలంలో పూర్తి చేసే బాధ్యత తనదేనని' మంత్రి కేటీఆర్ అన్నారు.

### హిందూ.. ముస్లింల ఐక్యతకు ప్రతీక హైదరాబాద్

హిందూ.. ముస్లింలు గంగా జమునా తహజీబ్ మాదిరిగా ఐకమత్యంతో కలిసి మెలిసి ఉంటారు. కొన్ని నెలల క్రితం జరిగిన గణేశ్ నిమజ్జనం శోభాయాత్ర నాడే ముస్లింల మిలాద్-ఉన్-నబీ ర్యాలీ ఉన్నది. కానీ, ముస్లిం లు మతసామరస్యాన్ని కాపాడుతూ మిలాద్-ఉన్-నబీ ర్యాలీను నాలుగు రోజులకు వాయిదా వేసుకుని ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా చాటిచెప్పిన ఖ్యాతి నగరానికి దక్కిందన్నారు. ఇక్కడ హిందూ, ముస్లిం, సిక్కులు, క్రిస్టియన్‌లు ప్రశాంతంగా జీవిస్తున్నారు.

### 18 ఏండ్లు నిండిన ఆడబిడ్డలకు సౌభాగ్యలక్ష్మి..

18 ఏండ్లు నిండిన అమ్మాయిలందరికి సౌభాగ్య లక్ష్మీ స్కీం ను కొత్తగా ప్రవేశపెట్టనున్నాం. అర్హులైన వారికి ప్రతి నెల రూ.3,000 చొప్పున భృతి ఇవ్వనున్నట్లు ప్రకటించనున్నారు. రైతు బీమా తరహాలోనే అర్హులైన వారికి కేసీఆర్ బీమా ను అధికారం ఏర్పాటు చేసిన వెంటనే అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఎల్‌బీనగర్ నుంచి పెద్దఅంబర్‌పేట వరకు మెట్రో ట్రైన్ సేవలను విస్తరించనున్నట్లు తెలిపారు. పలు ప్రాంతాల్లో ఫ్లైఓవర్ నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలియజేశారు.

### అభివృద్ధి జరుగాలంటే.. బీఆర్‌ఎస్‌ను గెలిపించండి

మలక్‌పేట అన్ని రంగాల్లో అభివృద్ది చెందాలంటే బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. కేటీఆర్ రోడ్‌లో తీగల అజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయన్నారు. మలక్‌పేట ను అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లుతానని ఆయన పేర్కొన్నారు.

### కేటీఆర్ కు స్వాగతం పలికిన టీఎస్ఆర్టీ పోర్టర్స్ యూనియన్ కార్మికులు

టీఎస్ఆర్‌టీసీ పోర్టర్స్ యూనియన్ కార్మికులు రాష్ట్ర మంత్రి కేటీఆర్ కు ఘన స్వాగతం పలికారు. ముసరాంబాగ్ లో రోడ్డు షోకు విచ్చేసిన మంత్రికి టీఎస్ఆర్టీసీ పోర్టర్స్ యూనియన్ అధ్యక్షుడు కారింగల మారుతి నేతృత్వంలో దిల్‌సుఖ్‌నగర్ జాతీయ రహదారి పై స్వాగతం పలికారు. జై కేటీఆర్... జై తెలంగాణ అంటూ నినాదాలు చేస్తూ అందర్ని ఆకట్టుకున్నారు.

### భారీ గజమాలతో స్వాగతం..

రోడ్డు షోకు విచ్చేసిన మంత్రి కేటీఆర్‌కు బీఆర్ఎస్ పాతమలక్‌పేట డివిజన్ నాయకులు పగిళ్ల నర్సింగ్, వెంకటేశ్, టిన్నూ సింగ్, సుదర్శన్, చౌకి రాజేశ్, వేణు, మహేశ్ క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసిన గజమాల ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభా వేదిక వద్దకు రాగానే క్రేన్ సహాయంతో ప్రచారం రథంపై ఉన్న మంత్రి కేటీఆర్ కు గజమాలతో స్వాగతం పలికారు.



భారీ గజమాలతో స్వాగతం పలికిన అభిమానులు




మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న టీఎస్ఆర్టీసీ పోర్టర్స్ యూనియన్ కార్మికులు

## బీఆర్‌ఎస్‌తోనే.. పాతనగరం అభివృద్ధి



కుర్మగూడలో యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డికి మద్దతుగా ప్రచారంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సామ స్వప్నసుందర్ రెడ్డి

సైదాబాద్, నవంబర్ 25 : పాతనగరం అభివృద్ధి బీఆర్ఎస్ తోనే సాధ్యమని యాకుత్‌పుర బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్ రెడ్డి అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కుర్మగూడ డివిజన్‌లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామ సుందర్ రెడ్డి మాట్లాడుతూ.. నియోజక వర్గ పరిధిలోని ప్రతి ఇంటికి ఏదో ఒక రూపంలో సంక్షేమ పథకాలు అందిచామని తెలిపారు. బీజేపీ కార్పొరేటర్లు ఎటువంటి అభివృద్ధి చేయలేదని మౌలిక సదుపాయాలను కల్పించటంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలకు కనీసం తాగు, మురుగునీరు వ్యవస్థలను ఆధునీకరించలేని స్థితిలో స్థానిక నాయకులు ఉన్నారని ఆరోపించారు. ఏ ఇతర పార్టీకి ఇంతటి పురోగతిని చూపించే కనీస ప్రణాళిక కూడా లేదని, వాటిని నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. యాకుత్‌పురలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, విశేష అభివృద్ధితో ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మెట్రోరైల్ నిర్మాణం, ఫ్లైవర్ ఓవర్ బిడ్జిలు నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని, వాటి పనులు త్వరలోనే పూర్తి కానున్నాయని తెలిపారు. నియోజక వర్గం ఓటర్లు బీఆర్ఎస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, మరోమారు కారు గెలిచి కేసీఆర్ సార్ సర్కార్ అధికారంలోకి రావటం ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు.



సాయిలాల్ తోటలో ప్రచారంలో పాల్గొన్న యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి

## గడప గడపకు మాజీ కార్పొరేటర్ల ప్రచారం ..

కుర్మగూడ డివిజన్ పరిధిలోని చంద్రయ్య హట్స్, మైదీపుర, షాయిలాల్ తోట, పూలతోట, ఉప్పరి బస్తీ, భరత్‌నగర్, మాదన్నపేట, ఎరుకల బస్తీ ప్రాంతాల్లో సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సామ స్వప్నసుందర్ రెడ్డి బీఆర్ఎస్ తరుపున నిర్వహించిన ప్రచారానికి విశేష స్పందన వచ్చింది. ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డికి మద్దతుగా మహిళలు ఇండ్లనుంచి బయటకు వచ్చి హారతులు పట్టి మాజీ మహిళా కార్పొరేటర్లకు స్వాగతం పలికారు. సైదాబాద్, ఐఎస్ సదన్ డివిజన్ల మాజీ కార్పొరేటర్లు సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, సామ స్వప్నసుందర్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం షీ - టీమ్స్ ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఆర్థికంగా రాణించటానికి రుణాలను ఇప్పిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. ఓటర్లును కలిసి బీఆర్ఎస్ పథకాల కరపత్రాలను అందజేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కుర్మగూడ, ఐఎస్ సదన్, సంతోష్‌నగర్ డివిజన్ల అధ్యక్షులు దర్శనం నర్సింగ్‌రావు, మెట్టు భాస్కర్ రెడ్డి, చింతల శ్రీనివాస్, సాబేర్, శివ పాల్గొన్నారు.



మాదన్నపేటలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న యాకుత్‌పుర బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ సుందర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు దర్శనం నర్సింగ్‌రావు, శ్రీనివాస్, మెట్టు భాస్కర్ రెడ్డి